## 15

## జెండా వందనం

ఆ ఊళ్లో...

ఆ రాత్రికి అసలు నిద్రలేదు.

తెల్లవారితే స్వాతంత్ర్య దినం-ఘనంగా జరపాలని ప్రభుత్వం చేసిన ఆర్డర్లు, చేతుల రూపంలో చేతల రూపం దాలుస్తోంది.

ఊళ్లోకి కనెక్షన్లున్నాయి—కరెంటు లేదు.

పెట్రోమాక్స్, కందిళ్ళు, గుడ్డివెల్తుర్లో చేతులు ఉత్సాహంతో పనిచేశాయి. రంగు రంగుల జెండాల తోరణాలు, గేట్లన్నింటికీ సుస్వాగతాల బ్యానర్లుకట్టేయి. పనయిపోగానే చేతులు ఆవురావురుమని నోళ్ళు తెరిచాయి. పురపాలక సంఘంలోని ఉద్యోగి ఒకసారి అన్నీ తనిఖీ చేసుకుని, కూలీ డబ్బులు పడేయగానే, వాళ్ళ చేతినోళ్ళన్నీ మూసుకున్నాయి.

*　　*　　*

నిద్రలేని ఆ రాత్రికి కళ్ళు ఎర్రబడ్డాయి. కళ్ళ ఎరుపంతా రాత్రి కట్టిపెట్టిన జెండాపై పడింది. అది చూసి జనులంతా బెంబేలు పడ్డారు. ఆలస్యమౌతుందేమోనని ఆందోళనపడుతూ కార్యక్రమానికి సంసిద్ధులయ్యారు. ఎండ జెండా మీదినుండి, దాని తాడువెంట, సన్నని జెండా స్థంభం వెంట కిందికి దిగి, మనుషుల వెంట్రుకల్ని మెరిపింప జేస్తూ ముఖాలమీద కొట్టింది.

అప్పుడు—

ఒక వృద్ధుడు. ప్రభుత్వం దృష్టిలో వ్యర్థుడు రిక్షా దిగాడు. జనులంతా అతనికి ఎదురేగారు. అతను పిచ్చివాడిలాగా వున్నాడు.

నెత్తి, ముఖం, బట్టలూ అంతా పిచ్చిగా వున్నాయి. కాని, అతడు పిచ్చివాడు కాదని అక్కడి, వేలమందికి తెల్సు. అక్కడలేని కోట్ల మందికీ తెలుసు.

ఎదురు తిరిగే అతని మనస్తత్వం గురించి, అతని కొడుక్కు జరిగిన అన్యాయం గురించి అక్కడున్న ప్రతి గుండె, మెదడు, తల వంచుకుంటోంది. అసలతన్ని అక్కడికి పిలవడమే తప్పైనట్లు అక్కడ కొంతమంది దిక్కులు చూస్తున్నారు. ప్రభుత్వపు ఎర్రసిరా గీతలనబడే పోలీసులు అక్కడ కనిపించనందుకు కొంత నెమ్మదిపడి, ఆ వచ్చిన ముసలతన్ని అనుసరిస్తున్నారు.

ఆ వృద్ధుడు చాలా బలహీనంగా వున్నాడు.

అతను నలుదిక్కులా దృష్టి సారించాడు.

అతడొక కవి.

అతడొక మేధావి.

అతడొక ప్రశ్నల పుట్ట.

అతడొక ఎత్తిన తల. అందుకే, అందుకే-అతన్నేం చేసిందీ అధికారం? నోరు మూసుకుని కూచోమంది. పూర్తి విశ్రాంతి తీసుకో మంది సి-క్లాస్ జైల్లో కొన్నేండ్ల చీకట్లో గడపమంది.

చీకట్లోంచి వెలుగులోకి పంపిస్తున్నామని చెప్పి ఏం చేసింది?

బ్రతుకంతా కటిక చీకటి చేసింది.

అతని వారసుణ్ణి

అతని రక్తపు బిందువును

కాలేజీ మొగ్గను, భవిష్యత్ యింజనీర్ను, శరీరం లేకుండా చేసింది. ప్రాణం మిగిలింది. ప్రజల గుండెల్లో-శరీరంలేని ప్రాణాన్ని స్పృశించాడతను. ఊపిరి లేని గాలిని అనుభవించాడతను. ఫలితంగా ఇప్పుడతనికి గొంతులేదు- విప్లవపదజాలముంది.

అతనికి స్వరంలేదు—వినిపించని ఘోషవుంది.

అతనికి కొడుకులేడు—అతను మాత్రం తండ్రి.

ఆ సందర్భంగా అతన్ని పిలిచినందుకు సంతోషిస్తున్నారు కొందరు. దుఃఖిస్తున్నారు కొందరు. అతను మాత్రం అతని లాగానే మనుషుల మధ్య అతి సామాన్యంగా వున్నాడు.

అతడొక సైనికుడు.

అతని ఆయుధాలు కనిపించవు. అతడు కదిలాడు.

జనంలో అంతదాకా బిగబట్టిన ఊపిర్లు మళ్ళీ సాగాయి. వృద్ధాప్యంలోనైనా ఎంతో స్థిరంగా, బలంగా ఒక్కొక్క అడుగూ పడింది. జెండా స్థంభం దాకా నడిచాడు. చుట్టూ చూశాడు. వందలు, వేలు జనం ... జనం !! ఆ క్షణం అతని నిశ్శబ్దం అందరితో మాట్లాడింది. అతను జెండా పునాదుల్ని చూశాడు. జనులంతా చూశారు. మెల్లిగా చూపుల్ని మెడకండరాల సహాయంతో లేపుతూ జెండా స్థంభం చివర్లోని ఆకాశంలోకి చూశాడు. సూర్యుడి వెలుగులో అది ఎర్రగా కనిపించింది. ఈ సూర్యుడెవరూ? మండేవాడు! ప్రతి మండేవాడూ సూర్యుడే అనుకున్నాడు. జనులవైపు చూశాడు. గంభీరంగా వున్నారు. సూర్యకిరణాలు పులుముకుని ఎర్రని ముఖాలతో వున్నారు. ఎంతో సంతోషించాడతను. జనులకు ఉల్లాసం కలిగింది. తన కవితల్లోని చరణాల్లా, చరణాల్లోని భావాల్లా జనులంతా చైతన్యవంతంగా తలలెత్తుకు చూస్తున్నారు.

దేహపు సర్వ దుర్వాసనల్నీ ఒక్క సెంటు చుక్కతో దాచేసినట్లు, దేశపు దుస్థితినంతా ఒక్క తెల్లబట్ట ముక్కతో దాచేయగలమన్నట్లు, కొందరు తెల్లమనుషులు-బ్రతుకుతున్న నిర్జీవులు! గాలి ఎటువైపొస్తే అటు వూగులాడే, (అన్ని అన్యాయాలు దాచేయగల) తెల్లకర్రెన్లు !!—కనిపించారు. వాళ్ళు తలలు వంచుకుని, విషయం విషమించిందన్నట్లు చేతులు కట్టుకుని నిలబడ్డారు.

మహాకవి పైన కట్టిన జెండాను చూశాడు- మూటలా వుందది. తన గుండెలా వుందది. నిదానంగా తాడు లాగాడు. తన గుండె ముక్కలు రాలిపడ్డట్టు, ఇన్నేళ్ళ స్వాతంత్ర్యంలో భద్రతలేని కోట్ల జీవితాల బతుకులు చీలిపోయినట్టు, చెల్లాచెదురుగా పడ్డాయి, రంగు కాగితం ముక్కలు! అందరూ తలెత్తి చూశారు. జరిగిన తప్పు గ్రహించారు. దేశంలోని స్వాతంత్ర్యంలాగా జెండా తలక్రిందులుగా వుంది. తెల్ల మనుషులకు కోపం వచ్చింది. రాత్రి జెండా కట్టిన కూలి వాళ్ళమీద, దేశంలో వున్న అజ్ఞానులమీద.

స్వాతంత్ర్యానికి సంతాపంగా, తలలు వంచుకుని నిలబడి నట్లుంది ప్రజ-

ఒక్కసారి తోరణాలు పరికించాడు కవి-

ఇన్నేళ్ళ స్వాతంత్ర్యం తరువాతకూడా ఆకలితో మండి పోతున్న కోట్లమంది జీర్ణాశయాలు వ్రేలాడదీసినట్టు,

ఎర్ర రంగు కాగితాలు వూగుతున్నాయ్!! ○

వీచిక మాసపత్రిక
సెప్టెంబర్ 1977